# `మరణ ముహూర్తం'

## – సత్యం మందపాటి కథ –

ఆ రోజు రాత్రి డైనింగ్ టేబుల్‌దగ్గర కూర్చుని భోజనం చేస్తున్నప్పుడు అడిగాను గిరిజని, `ఎలా వుంది ఇవాళ మీ ఆఫీసులో!' అని.

గిరిజ మా ఊళ్ళోనే, స్టేట్ ప్రిజన్ సిస్టంలో కౌన్సెలింగ్ సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్నది.

`ఇవాళా? ఒక చిన్న విశేషం వుంది' అని ఒక్క క్షణం ఆగింది.

గుత్తి వంకాయ కూర తింటూ ఆమె వేపు చూశాను.

`మన ఇండియన్స్‌లో కూడా ఇలాటి వాళ్ళు వుంటారనుకోలేదు!' అంది హఠాత్తుగా.

నేనూ మాట్లాడ లేదు, ఆమె ఆలోచనలకు అడ్డు రాకుండా వుండాలని.

తనే చెప్పటం మొదలుపెట్టింది.

`సునేత్ర అని ఒక ఒరిస్సా అమ్మాయి. అమెరికన్ సిటిజెనే. ఇక్కడే మెక్కాలెన్ అనే ఊళ్ళో వుంటుంది. ఆ అమ్మాయి మొగుడ్ని కాల్చి చంపేసింది. మరణ శిక్ష విధించారు. డెత్‌రోలో వుంది'

నాకు ఆశ్చర్యమే కాక, కుతూహలం కూడా పెరిగింది.

`మొగుడ్ని కాల్చేసిందా? ఎందుకు? ఎన్నేళ్ళావిడేమిటి?' గబగబా అడిగాను.

`ఆ అమ్మాయికా? ముప్ఫై ఏళ్ళుంటాయి. ఇద్దరం ఇండియన్ ఆరిజిన్ వాళ్ళమే కనుక, కౌన్సెలింగ్ చేయటానికి బాగుంటుందని ఆ కేసుకి నన్ను ఎసైన్‌చేశారు. నాకింకా ఆమె కేస్ ఫైల్ ఇవ్వలేదు. ఇప్పటిదాకా తెలిసిందేమిటంటే మొగుడ్ని చంపేసిందని. ఆ అమ్మాయి అలా అని ఒప్పుకుందిట కూడాను. అందుకే కేసు తొందరగా తెమిలిపోయింది. డెత్‌రో లో వుంది! అంటే కొన్నాళ్ళు మా జైల్లోనే వుంటుంది. తర్వాత ఆమె జీవితం ఎప్పుడు అంతం చేసేదీ నిర్ణయిస్తారు'

`అరె పాపం! ఎందుకు చేసింది అలాటి పని! ఏదో బలమైన కారణమే వుండి వుంటుంది. ఆ అమ్మాయి మొగుడు ఇండియనా, అమెరికనా?' అడిగాను.

చిన్నగా నవ్వింది గిరిజ. `తెలీదు. ఆ ఫైల్ నాకు రేపు ఇస్తారు. అప్పుడు చెబుతాను అన్నీ వివరంగా', ఒక్కక్షణం ఆగి మళ్ళీ అంది `కానీ అవన్నీ కాన్ఫిడెన్షియల్ ఎవరితోనూ ఎక్కడా అనకు' అంది భార్య హెూదాలో.

`నేనెందుకు చెబుతాను. నా సంగతి నీకు తెలీదూ!' అన్నాను నన్ను అనుమానంగా చూస్తున్న గిరిజతో.

నా మాట విని సన్నగా నవ్వింది.

`మన పెళ్ళయిన పదిహేనేళ్ళల్లోనూ నా మీద నీకున్న నమ్మకం ఇంతేనన్నమాట. పోనీ ఒక పని చేయి.

పబ్లిక్ ఇన్ఫర్మేషన్ మాత్రమే చెప్పు. ఉద్యోగరీత్యా చెప్పకూడనివి చెప్పకు' అన్నాను.

మర్నాడు సాయంత్రం వర్క్‌నించీ వచ్చి వంట చేస్తున్నది గిరిజ, నేను ఆఫీసునించీ వచ్చేసరికి.

బ్రీఫ్‌కేస్ సోఫాలో పడేసి, ఫ్రిడ్జ్‌లో నించీ ఒక గ్లాసెడు చల్లటి మంచి నీళ్ళు తీసుకుని, ఆమె ఎదురుగా నుంచుని `ఏమిటి కబుర్లు?' అన్నాను.

`ఏముంది.. ఫ్రీజ్ చేసిన బీరకాయలు వుంటే, నీకు ఇష్టమని ఇవాళ బీరకాయ కూర, బీరకాయ పచ్చడి, బీరకాయ పప్పు చేస్తున్నాను. సాంబారులో కూడా బీరకాయ వేద్దామా వద్దా అని ఆలోచిస్తున్నాను. నీ సలహా ఏమిటి?' అంది కొంటెగా నవ్వుతూ.

గిరిజ భుజాల మీద నించీ భయపడుతూనే తొంగిచూశాను స్టవ్ దగ్గర వున్న మూడు గిన్నెలనీ. బెండకాయ కూర, టమాటా పచ్చడి, మామిడికాయ పప్పూ.

నేనూ నవ్వుతూ అన్నాను `సరే కానీ. నాకిష్టమని నువ్వు కష్టపడి చేస్తుంటే, నేను వద్దనటం ఎందుకు. సాంబారులో కూడా వెయ్యి బీరకాయ ముక్కలు. సో హవ్ ఈజ్ యువర్ డే'

`షరా మామూలే' అంది, సాంబారులో చిలకడదుంప ముక్కలు వేస్తూ.

`మా ఆఫీసులో కూడా అంతా మామూలే! ఇవాళ ఎవడో కష్టమరాసుడు మా ప్రాడక్ట్ క్వాలిటీ గురించి ఏదో కంప్లైంట్ చేశాట్ట. అది నాకు అప్పచెప్పారు. కష్టమర్ శాటిస్ఫాక్షన్ ముఖ్యం కదా!' అన్నాను. మా ఆఫీసులో నా బల్ల మీద ఒక బోర్డు వుంది. `రూల్‌నెంబర్‌వన్ – కష్టమర్ ఈజ్ ఆల్వేస్ రైట్. రూల్ నెంబర్ టు – ఇఫ్ కష్టమర్ ఈజ్ రాంగ్ సీ రూల్ నెంబర్ వన్' అని.

సాంబార్‌లో అప్పుడే పోపు పెట్టిందేమో, ఘుమ ఘుమా వాసన వేస్తున్నది.

డైనింగ్ టేబుల్ మీద ప్లేట్లూ గ్లాసులూ పెడుతూ అడిగాను – `ఏమయింది నీ హత్య కేసు' అని.

`నా హత్య కేసేమిటి? నాకూ ఆ హత్యకీ, హత్య కేసుకీ ఏమీ సంబంధం లేదు. నేను కౌన్సెలింగ్ సైకాలజిస్టుని మాత్రమే'

`తెలుసులేవోయ్ ఏమంటున్నది ఆ ఒరిస్సా వనిత?' అడిగాను కుతూహలంగా.

`ఆవిడ కేస్ ఫైల్ క్షుణ్ణంగా చదివాను. ఆవిడ పేరు సునేత్ర. టెక్సాస్‌లోనే మెక్కాలెన్లో భర్తతో వుండేదిట. పెద్ద చదువుకున్న అమ్మాయి కాదు. అమెరికా వచ్చినా శనేశ్వరం తప్పలేదు ఆమెకి. అతను.. అతనూ ఒరిస్సా వాడే .. ఆమెను రోజూ తెచ్చిన కట్నం చాలదని వేధించటం మొదలుపెట్టాడుట. మాటలతోనే కాక చేతలతో కూడా. అతని బాధలు భరించలేక, ఇండియాకి వెళ్ళిపోతానంటే వీల్లేదన్నాడుట. పారిపోయి ఏదన్నా ఉద్యోగం చేసుకుందామంటే, ఇటు చదువూ లేదు, అటు ధైర్యమూ లేదు. ప్రతి రోజూ ఆమెని కొట్టేవాడుట. చిత్ర హింసలు పెట్టేవాడుట. మెడ పట్టుకుని పిసికి చంపుతానని బెదిరించే వాడుట. ఇలా ఏడేళ్ళు గడిచి పోయాయి. ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. ఆమెని మాత్రం ఒక్కసారి కూడా ఇండియాకి వెళ్ళనీయలేదుట'

`మరి పోలీసులకి రిపోర్ట్ చేయవచ్చు కదా. ఇక్కడ లా ఒక్కింత కన్నా ఎక్కువే వుంటుంది కదా!' అన్నాను.

`ఆవిడకి అంత ధైర్యమే వుంటే ఈ కథ ఇంత దాకా ఎందుకు వస్తుంది. అందుకనే తను ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. అలా చేసినందు వల్ల తన బాధలు తప్పకుండా పోతాయి. కానీ అతను మళ్ళీ ఇంకా ఎంతో కట్నం తీసుకుని ఇంకో అమ్మాయిని పెళ్ళిచేసుకుని, ఆ అమ్మాయిని కూడా హింసించడని గ్యారంటీ ఏమిటి? అదీకాక తన ఇద్దరు పిల్లల సంగతి ఏమిటి? అందుకని ముందు అతన్ని చంపి, పిల్లలని కూడా చంపి, తను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది!'

ఆ మాట వినగానే నిజం చెప్పొద్దూ నాకు కొంచెం గాభరా పుట్టింది. `అది కనీవిని ఎరుగని అమానుషం. అంత రాక్షసత్వం, ధైర్యం ఎలా వచ్చాయి ఆమెకి?' అడిగాను.

`ఒక గదిలో పెట్టి చావ బాదితే పిల్లి పిల్ల కూడా, భరించలేని పరిస్థితిలో పులిలా తయారయి తిరగబడు తుందని వినలేదూ. ఇదీ అంతే. కాకపోతే ఆ ధైర్యం ఆమెలో చివరిదాకా నిలబడలేదు. నిద్రపోతున్న మొగుడిని ఒక రోజు పొద్దునే కత్తితో పొడిచి చంపేసింది. పిల్లలు ఇద్దరికీ పాలల్లో విషం కలిపి ఇచ్చింది. అనుకున్నట్టుగానే, అటు ఆ దుర్మార్గుడి జీవితం అంతం చేసింది. ఇటు తన పిల్లలు అనాథలు కాకుండా చేసింది. కానీ తను ఎంతో ప్రేమించిన పిల్లల మృత దేహాలు చూసి, తట్టుకోలేక పెద్దగా అరిచి స్పృహ తప్పి పడిపోయింది. తరువాత ఒక గంటకి కళ్ళు తెరిచేసరికీ పక్కన పక్కింటి ఆవిడ, పోలీసులు వున్నారు. ఆమెకి ఇక ఆత్మహత్య చేసుకునే అవకాశమే రాలేదు. అలా పోలీసులకి పట్టుపడిపోయింది'

`నమ్మ బుద్ధి కావటం లేదు' అన్నాను.

`కోర్టులో జ్యూరీ ఈ కేసంతా విన్నాక, ఆమెని నేరస్తురాలిగా పరిగణించారు. తనని వేధించిన భర్తని చంపినందుకు, పెద్ద శిక్షని తప్పించుకునేదేమో. కానీ ఇద్దరు చిన్న పిల్లలని, అందులోనూ కన్న పిల్లలని, చంపటం జ్యూరీకి నువ్వు అన్నట్టుగానే అమానుషంగా కనిపించింది. ఆమెకి మరణ శిక్ష విధించారు!'

అది వింటుంటే చాల బాధ వేసింది. లేచి డైనింగ్ టేబుల్ చుట్టూ కాలుగాలిన పిల్లిలా తిరిగాను.

`నేనివాళ మొదటి సైకలాజికల్ ఇవాల్యుయేషన్ చేశాను. మనిషి మంచిదే. బాగా కో ఆపరేట్ చేసింది. బరంపురం ఆవిడ కనుక తెలుగు కూడా బాగా మాట్లాడుతుంది' అంది గిరిజ, డైనింగ్ టేబుల్ మీద ప్లేట్లూ, గిన్నెలూ పెడుతూ.

`ఏమిటో నాకు మాత్రం ఈవిడ కథ వింటుంటే అదోలా వుంది. తన సమస్యని పరిష్కరించుకోవటానికి ఇంతకన్నా మంచి మార్గాన్ని ఎందుకు ఆలోచించలేదో?' అన్నాను.

`మనిషి ఒక విధమైన ఉద్రేకంలో వున్నప్పుడు, తన బాధ భరించలేనంతగా ఎదిగి భయపెట్టినప్పుడు, వివేకం నశించటంలో ఆశ్చర్యం లేదు. అలాటప్పుడు ఆ ఉద్రేకంలో ఏం చేస్తారో చెప్పటం కష్టం'

సాలోచనగా వింటూ అన్నం తింటున్నాను.

`నా గురించి అడిగింది. నా పేరు చెప్పాను కానీ ఇంకే వివరాలు చెప్పలేదు. చెప్పకూడదు. ముఖ్యంగా ఇంటి పేరూ, ఫోన్ నెంబరూ.. లాటివి'

`అవును. ఆ వివరాలు చెప్పటం మంచిదికాదు'

గిరిజ నవ్వింది. `భలే చెప్పావే. నేనీ ఉద్యోగంలో చేరి చాల ఏళ్ళయింది. ఇవన్నీ మొదటి రోజు ఓరియంటేషన్‌లోనే చెప్పారు. నేను కేస్ ఇవాల్యుయేషన్ చేసేటప్పుడూ, కౌన్సెలింగ్ చేసేటప్పుడూ, నా భద్రత కోసం పక్కనే ఒక పోలీసాఫీసర్ నుంచుంటాడు కూడాను'

`అవన్నీ ఇంతకుముందు చెప్పావులేవోయ్' అన్నాను ఆవకాయ కలుపుకుంటూ.

`ఎన్నో ఏళ్ళుగా అమెరికన్లనీ, మిగతా దేశాలవారినీ కౌన్సెలింగ్ చేస్తున్నాను కానీ, మన ఇండియన్సుని చూడటం ఇదే మొదటిసారి. అందులోనూ హత్య కేసులో ఇరుక్కున్న మన ఆడవాళ్ళని' అంది గిరిజ.

నాకు తెలుసు ఆ ఉద్యోగం చేయటం ఎంత కష్టమో. చిన్న చిన్న తాగుబోతుల నించీ హంతకుల దాకా, రకరకాల నేరస్థులు తారసపడుతుంటారు. జైల్లో అడుగు పెట్టిన ప్రతి నేరస్థుడితోనూ మాట్లాడి, సైకలాజికల్ అనాలిసిస్ చేసి అది రికార్డ్ చేయాలి. కొంతమందిని మాత్రం కౌన్సెలింగ్ కూడా చేయాల్సి వస్తుంది. అలాటివారితో రోజువారీ పరిస్థితిని గురించి చర్చించటం ఆమె ఉద్యోగం. కొంతమందికి ఓదార్పు మాటలే కాక మందులు కూడా అవసరమవుతాయి. వాళ్ళని డాక్టర్లకీ, సైకియాట్రిస్ట్‌లకీ చూపించటం మొదలైనవి కూడా ఆమె వృత్తి ధర్మమే. ఆ ఉద్యోగం ఒక్కొక్కప్పుడు మనసుని వికలావికలం చేస్తుంది. ఆ రోజున ఆవిడకి రాత్రిళ్ళు నిద్ర పట్టదు. అందుకే చాలాసార్లు చెప్పాను గిరిజకి ఆ ఉద్యోగం మానేసి ఇంకేదైనా చూసుకోమని.

`నిన్ను ఇంజనీరు ఉద్యోగం మానేయమంటే నువ్వు మానేస్తావా? నాకు ఈ సబ్జెక్ట్ అంటే చాలా ఇష్టం. అందుకే పీ హెచ్‌డి చేశాను సైకాలజీలో. వాటిని ఎదుర్కోవటంలోనే వుంది నా జాబ్ శాటిస్ఫాక్షన్, సంతోషం. ఐ లవ్ మై జాబ్ అనేది. అంతేకాదు మంచి కౌన్సిలర్ అని పేరు కూడా తెచ్చుకుంది.

రెండు మూడు రోజుల తర్వాత కాబోలు, ఒక రోజు నాతో అంది గిరిజ.

`సునేత్రలో ఆత్మహత్య చేసుకోవాలనే కోరిక బలంగా వుంది. భర్తనీ పిల్లల్నీ చంపాక తను ఆత్మహత్య చేసుకోవాలనుకుందని చెప్పాను కదా. ఇప్పుడు ఒంటరిగా జైల్లో కూర్చుని ఆలోచిస్తుంటే, ఆమెలో ఆ కోరిక రోజురోజుకీ బలం పుంజుకుంటున్నది. ఆమెలో ఆ ఆత్మహత్యా భావం సహజంగానే వుంది. అదీకాక డెత్ రోలో, అంటే మరణ శిక్ష కోసం ఎదురుచూస్తూ కాలం గడిపే రోజుల్లో ఆ భావం రావటం సర్వసాధారణం. ఆ కోరిక ఆమెలో బలంగా వుందని నా పరిశీలనలో బయటపడింది. అదే నేను నా రిపోర్టులో వ్రాశాను. అప్పటినించీ ఆమె మీద నిఘా ఎక్కువయింది. ఆమె ఆత్మహత్యా ప్రయత్నం చేసుకోకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. ఎవరో ఒక పోలీసాఫీసరు ఆమెను అనుక్షణం గమనిస్తూనే వుంటాడు. నా కౌన్సెలింగ్ కూడా ఆమెని ఆ ప్రయత్నం నించీ విరమింపచేయటానికే చేస్తున్నాను!'

`సునేత్ర అంటే మంచి కళ్ళున్న అమ్మాయి అని అర్థం' అన్నాను.

`అవును. ఆమె కళ్ళే కాదు. ముఖం కూడా చాలా అందంగా వుంటుంది. మనిషి కొంచెం చామన చాయగా వున్నా, చాల ఆకర్షణీయంగా వుంటుంది. చూడగానే మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తుంది'

తర్వాత ఒక నెల రోజుల పైనే గడిచినట్టుంది. గిరిజ అప్పుడప్పుడూ సునేత్ర గురించి చెబుతూనే వున్నా పెద్ద విశేషాలేమీ లేవు. ఆమె డెత్ రో లోనే వుందనీ, ఆ తీర్పుని ఎవరూ ప్రశ్నించకపోవటం వల్ల, మళ్ళీ కోర్టుకి

వెళ్ళే అవకాశం కూడా లేదని చెప్పింది. కాకపోతే ఆ శిక్ష ఇక ఎప్పుడు అన్నదే ఇక చేయవలసిన నిర్ణయం అంది.

అమెరికాలో మరణ శిక్షలు గట్టిగా అమలు పరిచే రాష్ట్రాల్లో టెక్సాస్ ఒకటి. కనుక ఆమెకి మరణ శిక్ష ఖాయం. కాకపోతే ఆ మరణ ముహూర్తం కోసం రాత్రీ పగలూ కాచుకు కూర్చోవటం, ఆ మరణం కన్నా కష్టం కాదూ!

ఆరోజు సాయంత్రం నేను ఆఫీసునించీ ముందే వచ్చి పేపర్ చదువుకుంటూ కూర్చున్నాను. మూసుకుంటున్న గరాజ్ డోర్ శబ్దం గిరిజ కూడా ఇంటికి వచ్చినట్టు చెబుతున్నది. పేపర్ పక్కన పెట్టి, గిరిజకి ఎదురు వెళ్ళాను. అలసి పోయినట్టు తెలుస్తూనే వుంది ఆమె అందమైన ముఖంలో.

`ముందే వచ్చేశావే..' అంది.

`ఎవడో సప్లయర్ దగ్గరికి వెళ్ళాల్సి వస్తే బయటికి వెళ్ళాను. దారిలోనే కదా మళ్ళీ ఆఫీసుకి ఎందుకులే అని ఇంటికి వచ్చేశాను. హౌ ఈజ్ యువర్ డే' అడిగాను.

`మామూలే కానీ, ఒక చిన్న విశేషం వుంది. ఇవాళ ఏమయిందో తెలుసా? సునేత్ర జైల్లో తల గోడకి కొట్టుకుని ఆత్మహత్యా ప్రయత్నం చేసుకోబోయింది. ముందుగానే చూశారు కాబట్టి బ్రతికిపోయింది. తల చిట్లి ఎంతో రక్తం కారిపోయింది. అరడజను కుట్లు కూడా వేశారు. నాతో కూడా ఎక్కువ మాట్లాడకుండా ముభావంగా వుంది. ఆమె గదిలో ఒక విడియో కెమేరా కూడా పెట్టారు, ఇరవై నాలుగు గంటలూ ఆమెని కనిపెట్టి వుండటానికి. మళ్ళీ ఆత్మహత్యా ప్రయత్నం చేస్తుంటే వెంటనే వెళ్ళి అది ఆపటానికి'

వినటానికి కొంచెం బాధాకరంగానే వున్నా, నా ఆలోచనలు ఇంకొంచెం దూరం వెళ్ళాయి.

`మనిషిగా పుట్టి మనిషిగా పెరుగుతున్నా, ఈ మనుషుల తత్వాలూ, న్యాయాలూ, ధర్మాలూ నాకు ఏ మాత్రం అర్థం కాకపోగా, మానవత్వం మీద మనిషి పూస్తున్న మరకలు మాత్రం మసక మసగ్గా కనిపిస్తున్నాయి. ఉదాహరణకి ఈ విషయాన్నే తీసుకో. సునేత్రని ఆవిడ భర్త హింసించేవాడు. ప్రాణాలు తీయటానికైనా వెనుకాడని పశువు అతను. అతని బాధలు భరించలేక అతన్ని హతం చేసిందామె. కన్న పిల్లల్ని కూడా చంపటానికి వెనుకాడనంత బాధలు పడిందామె. తను ఆత్మహత్య చేసుకుందామనుకుంది కానీ, చేసుకోలేక చట్టానికి లొంగిపోయింది. అంటే తన మరణం కోరుకున్న భర్త మరణాన్ని తన చేతుల్లోకి తీసుకుంది. ఇప్పుడు ఆమె మరణాన్ని చట్టం తన చేతుల్లోకి తీసుకుంది. మరణ శిక్ష విధించింది. ఏనాడో జరిగే ఆ మరణం కోసం ఎదురు చూసే గుండె నిబ్బరం లేక, తన మరణాన్ని తన చేతుల్లోకే తీసుకోవాలని ఆత్మహత్యకి సిద్ధపడింది. అదే చట్టం ఆమెని ఆ ఆత్మహత్య చేసుకోనివ్వకుండా వేయి కళ్ళతో కాపాడుతున్నది. ఎందుకని? ఆమె చావు ఆమె చావ కూడదని. అంటే చట్టమే ఆ హత్య చేయాలనీ, అప్పటిదాకా చావకుండా ఆమెని రక్షిస్తున్నది. అలాటప్పుడు ప్రతి రోజూ, ప్రతి రాత్రీ ఆ చావు గురించే ఆలోచించే వ్యవధి ఇస్తూ, ధైర్యంగా వుండమనటంలో ఏమిటి అర్థం? ఆమెని చంపరు. చావనీయరు. ఎక్కడికి పోయింది మనుషుల్లో మానవత్వం. మరణం కన్నా ఈ మథనం ఎంతో పెద్ద శిక్ష కాదూ?' కొంచెం ఆవేశంగానే అన్నా, నా మాటల్లో ఆవేదన నాకే తెలుస్తున్నది.

గిరిజకి తెలుసు నా ఆలోచనలు ఎక్కడ నించీ ఎక్కడికి వెడతాయో. అందుకే ఏమీ మాట్లాడకుండా నా

చేయి పట్టుకుని మృదువుగా నిమిరింది.

రోజూ సునేత్ర గురించి గిరిజ ఏదో చెబుతూనే వుంది. బాగా చిక్కిపోయిందనీ, మరీ నిశ్శబ్దంగా తయారయిందనీ, తనతో కూడా సరిగ్గా మాట్లాడటం తగ్గించేసిందనీ చెప్పింది.

ఆ రోజు మధ్యాహ్నం ఆఫీసులో చాల సీరియస్‌గా పని చేసుకుంటున్నాను.

బల్ల మీద ఫోన్‌మ్రోగింది.

గిరిజ.

`బిజీగా వున్నావా?' అడిగింది.

`ఎప్పుడూ వుండేదే! చెప్పు. ఫరవాలేదు' అన్నాను.

`సునేత్ర ఇందాక చనిపోయింది!' ఆగింది గిరిజ.

అదిరి పడ్డాను.

`ఏం! ఏమయింది? ఆత్మహత్య చేసుకుందా?'

`అవును... కాదు.. అలాటిదే.. ఉండు మళ్ళీ ఫోన్‌చేస్తాను.. పది నిమిషాల్లో...' అని ఫోన్ పెట్టేసింది.

నాకు ఏమీ అర్థం కాలేదు.

సునేత్ర ఆత్మహత్య చేసుకుందా? పోయినసారి ఆమె ఆ ప్రయత్నం చేసినప్పటినించీ సెక్యూరిటీ పెంచారు కదా. ఆమెను వేయి కళ్ళతో, విడియో కెమేరాతో కనిపెట్టుకుని వుంటున్నారు మరి?

మరణ శిక్ష అమలు చేశారా? లీథల్ ఇంజెక్షన్ ఇచ్చారా? ఇంకా ఆ రోజు నిర్ణయించలేదని చెప్పిందే గిరిజ. న్యూస్ పేపర్లో కూడా రాయలేదే? మరి?

ఇంతలో మళ్ళీ ఫోన్ మ్రోగింది.

చటుక్కున అందుకున్నాను.

గిరిజ.

`ఎందుకు ఫోన్ పెట్టేశావ్' అడిగాను.

`సారీ! నీకు వెంటనే చెప్పాలని ఫోన్‌చేశాను కానీ, ఇక్కడ అంతా గందరగోళంగా వుంది. అందుకే'

`ఇంతకీ ఏమయింది?' ఆత్రుతగా అడిగాను.

`పాపం సునేత్ర చనిపోయింది'

`ఎలా'

`ఆమెతో మాట్లాడుతున్న పోలీస్ ఆఫీసర్ కొంచెం అజాగ్రత్తగా వుండటం గమనించి, అతని రివాల్వర్ తన చేతుల్లోకి తీసుకుంది సునేత్ర. అతన్ని హత్య చేస్తుందో, తనే ఆత్మహత్య చేసుకుంటుందో ఏమీ తెలియని పరిస్థితి అది. మిగతా పోలీసు ఆఫీసర్లు అందరూ నిర్ఘాంతపోయి ఏం చేయాలో తెలీక చూస్తూ నుంచు న్నారుట. ఆమె రివాల్వర్ తీసుకుని చేయి పైకెత్తే లోపలే, దూరం నించీ ఇంకో పోలీస్ ఆఫీసర్ ఆమెను కాల్చి వేశాడు. అతను ఆమె

చేతి మీద కాల్చబోతే, ఆమె అదే సమయంలో గిరుక్కున తిరగటంతో ఆమె ఛాతీలోకి దూసుకుపోయింది బులెట్ అక్కడికక్కడే మరణించిందిట' గిరిజ ఇక చెప్పలేక ఆగింది.

నా చేతిలోని ఫోన్ రిసీవర్ కూడా జారి క్రింద పడింది.

ఆమె మీద భర్త చేసిన హత్యా ప్రయత్నం.

ఆమె చేసిన హత్యలు. ఒకటి కాదు. మూడు హత్యలు. అటు భర్త. ఇటు ఇద్దరు పిల్లలు.

ఆత్మహత్యా ప్రయత్నం.

మరణ శిక్ష.

మరణానికి ఎదురు చూపులు.

మరో ఆత్మహత్యా ప్రయత్నం.

ఆత్మహత్య నించీ రక్షణ.

మరణ ముహూర్తం కోసం ఎదురు చూపులు.

ఈ మనుష్యులు పెట్టిన మరణ ముహూర్తం!

ముహూర్తం లేకుండానే అప్పగింతలు.

ఆమెకా? మానవత్వానికా?

*　　　　　*　　　　　*